క్లుప్తంగా

వీఓఏలకు శిక్షణ



అయిజ: మండల కేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో శుక్రవారం సీబీఓ(కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్) ఆడిటర్ శేఖర్ వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు)లకు శుక్రవారం పుస్తక నిర్వహణ, ఆడిట్, ఏటీఆర్‌లపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక లావాదేవీల రికార్డింగ్, ఆడిట్ నివేదికల సిద్ధీకరణ, సరైన డాక్యుమెంటేషన్లపై వివరించారు. గ్రామ సంఘాల్లో ఆర్థిక క్రమశిక్షణ, జవాబుదారీతనం పెంపొందించేందుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం జయాకర్, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు



అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని భీమవరం 33కేవీ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టినట్లు ఏఈ అఖిల్ తెలిపారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ మీటర్ల తనిఖీలు చేశామన్నారు. విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఏఈ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



ఇటిక్యాల: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు. శుక్రవారం మండల పరిధిలోని సాతర్ల పాఠశాలలను కాంప్లెక్స్ జీహెచ్‌ఎం పాగుంటన్నతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని సోషల్ మీడియాలో ఓ సందేశం వైరల్ కావడంతో జిల్లా విద్యాశాఖ విజయలక్ష్మి ఆదేశాల మేరకు సమయపాలన పాటించని ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



అయిజ: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సంపత్‌కుమార్ సమక్షంలో మండలస్థాయి బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంకాపురం రాముడు, మాజీ జెడ్పీటీసీ చిన్న హనుమంతులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. అయిజ మండలంలో అనేక సమస్యలు తిష్టవేశాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపిస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కాంగ్రెస్ నాయకుడు తనగల సీతారామిరెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డన్న, శ్షావలి ఆచారి, జనార్దన్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, భూంపురం నరసింహారెడ్డి, జయన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. శుక్రవారం కర్నూలు నుంచి పుల్లూరు మీదుగా కలుగోట్ల శివారులో హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని డ్రైవర్ నరేంద్ర, యజమాని వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పత్తి ఆటో బోల్తా

గట్టు: మండల పరిధిలోని మిట్టదొడ్డి స్టేజీ సమీపంలో పత్తి లోడుతో రాయచూర్‌కు వెళ్తున్న ఆటో శుక్రవారం తెల్లవారుజామున బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గుంతల రోడ్డుతో ప్రమాదాల బారిన పడుతున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి, దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



జూనియర్ కళాశాలలు కలేనా?



కాలినడకన వెంకటాపురం స్టేజీకి వెళ్తున్న తనగల విద్యార్థులు

- నాలుగు మండలాల్లో ఏర్పాటు చేయని వైనం
- ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు
- ఇంటర్ చదువుకు 22 కిలో మీటర్లు ప్రయాణం

శాంతినగర్: గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఉన్నత చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. ఆర్థిక స్థోమత లేక ఉన్నత చదువులు చదివించ లేక వారి పిల్లలను పొలం పనులు, కూలీ పనులకు పంపే పరిస్థితులు గ్రామాల్లో దాపురించాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా భవిష్యత్ కోసం ఉన్నత చదువులు చదవాలని కోరిక ఉన్నా సమీపంలో ప్రభుత్వ కళాశాలలు లేక మధ్యలోనే చదువులు ఆపేయాల్సిన పరిస్థితులు గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్నాయి.

పనులకు వెళ్లాల్సిన దుస్థితి

అలంపూర్ నియోజకవర్గంలో వడ్డేపల్లి, రాజోళి, ఉండవెల్లి, ఇటిక్యాల మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేకపోవడంతో ఆర్థిక స్థోమత లేని నిరుపేద విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో ఆర్థిక ఇబ్బందులతో చేరలేక మధ్యలోనే చదువులు మానేస్తున్నారు. మరి కొంత మంది విద్యార్థులు అయిజ, అలంపూర్‌కు వెళ్లి ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. దూరం వెళ్లలేని విద్యార్థులు వ్యవసాయ పనులు చేసుకుంటుండగా మరి కొందరు కూలీ పనులకు వెళ్తున్నారు. నాలుగు మండలాల్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాదిలో నాలుగు మండలాల వ్యాప్తంగా 1310 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న కళాశాల సాధన సమితి సభ్యులు(ఫైల్)

గతేడాది 90 శాతం ఉత్తీర్ణత ఉన్నా పదేళ్లలో సుమారు 14,000 మంది విద్యార్థులు జూనియర్ కళాశాలలు లేక చదువును మధ్యలోనే ఆపివేశారు.

డిగ్రీ కళాశాల ఉన్నా

వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయకుండా ఏకంగా ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేశారు. పదో తరగతి తరువాత ఇంటర్ (జూనియర్ కళాశాలలో) చదవందే డిగ్రీ ఎలా వెళ్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అంతేగాక పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసి జూనియర్ కళాశాల గురించి పట్టించుకోవడంలేదని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలేజీ ఏర్పాటుకు సహకరిస్తామన్నా

జూనియర్ కళాశాల ఏర్పాటుకు స్థానికంగా ఉన్న దాతలు రవీంద్ర ఎయిడెడ్ పాఠశాలలోని కొంత స్థలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా కళాశాల మంజూరు చేయడం లేదని వడ్డేపల్లి మున్సిపాలిటీ ప్రజలు వాపోతున్నారు. గతంలో డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో దాతలు స్థలం ఇచ్చి కళాశాల నిర్మాణానికి సహకరించారు. జూనియర్ కళాశాలకు స్థలం సిద్ధంగా ఉందని, కళాశాల మంజూరు చేసి నిరుపేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

అయిజకు వెళ్తున్నాం



వడ్డేపల్లి మండలంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో అయిజ మున్సిపాలిటీలోని జూనియర్ కళాశాలకు ప్రతిరోజు వెళ్తుంటాం. మా ఊరి నుంచి కళాశాల సమయానికి బస్సు లేకపోవడంతో కాలినడకన వెంకటాపురం స్టేజి వరకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. శాంతినగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి. – సరిత, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, తనగల

రెండేళ్లుగా పోరాడుతున్నాం



2023 నుంచి జూనియర్ కళాశాల మంజూరు కోసం పోరాటం చేస్తున్నాం. కళాశాల సమితి ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శికి వినతిపత్రాలు అందజేశాం. రెండెకరాల స్థలం తీర్మానం చేసి ఇచ్చాం. ఇప్పటి వరకు కళాశాల మంజూరు కాలేదు. ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి నిరుపేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలి. – ఈశ్వరయ్య, కళాశాల సాధన సమితి కన్వీనర్, రాజోళి



సుంకేసులలో గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కళాశాల సమితి సభ్యులు (ఫైల్)

పన్నుల తగ్గింపుతో చరిత్రకు శ్రీకారం

ఎర్రవల్లి: దేశంలో 2.0 సంస్కరణలో పన్నులు తగ్గించి ప్రధాని నరేంద్రమోదీ చరిత్రకు శ్రీకారం చుట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజువారి జీవనంలో వినియోగించే నిత్యావసర వస్తువులపై 18 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించి సామాన్యుడికి ఖర్చులు తగ్గించారన్నారు. వ్యవసాయ యంత్రాలు, పరికరాలపై జీఎస్టీ తగ్గించి రైతులకు అండగా నిలిచిందన్నారు. వస్తువుల రేట్లు పెరగడం సర్వసాధారణం కానీ తగ్గడం చాలా అరుదన్నారు. ప్రధాని పిలుపు మేరకు మనం స్వదేశీని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అక్కల రమాదేవి, రాజశేఖర్‌శర్మ, మల్లేష్, నరేష్, మోహన్‌గౌడ్, నర్సింహ, కృష్ణ, బీచుపల్లి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



ఉండవెల్లిలో సీపీఆర్ పద్ధతిని వివరిస్తున్న వైద్య సిబ్బంది



ఇటిక్యాలలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనూష

ఇటిక్యాల: సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసుస్కియేషన్)పై అందరూ తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ అనూష అన్నారు. సీపీఆర్ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆకస్మాత్తుగా కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు సీపీఆర్ చేసి ప్రమాదం నుంచి కాపాడవచ్చన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ చేసే విధానంపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రనాగమ్మ, ఉపాధ్యాయులు సురేష్, ఏఎం, ఆశాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై ప్రత్యేక అవగాహన

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పల్లె దవాఖానా ఏఎస్‌ఎం సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కావడంతో తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్సకు ముందే సీపీఆర్ చేయాల్సిన పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి



మానవపాడులో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి పుష్పలత

కేటీదొడ్డి: పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మండంలోని చింతలకుంట గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు వెంకటష్, మోహన్‌బాబు, గోపాలమిత్రలు గోపాల్‌రెడ్డి, భీమయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మల్దకల్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారులు వినయ్‌కుమార్, ఉషా సూచించారు. మండలంలోని పాల్వాయి, కుర్తిరావల్‌చెర్వు, పెద్దొడ్డి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశారు. లంపీస్కిన్, గర్భకోశ వ్యాధి తదితర వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీశైలం, రాజేంద్ర, యుగంధర్‌రెడ్డి, రాముడు, మధు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు పంపిణీ

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో పశువైద్యాధికారి పుష్పలత గాలికుంటు వ్యాధి టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 133 పశువులు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

అమరచింత: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణ అన్నారు. పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌లో లావాదేవీల గురించి శుక్రవారం అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తేజేశ్వర్ హత్య కేసులో ముగ్గురు బైండోవర్

గద్వాల క్రైం: ప్రైవేటు సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ఇటీవల బెయిల్‌పై విడుదలైన ఏ-3 కుమ్మరి నగేష్, ఏ-4 చాకలి పరుశురాముడు, ఏ-5 చాకలి రాజులను శుక్రవారం గద్వాల సీఐ శ్రీను తహసీల్దార్ మల్లికార్జున్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సర్వేయర్ హత్య కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితులకు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే నిందితులు అల్లర్లు, దాడులు, హింసాత్మక సంఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదని పేర్కొన్నారు.

న్యాయం చేయండి సారూ..

మల్దకల్: మా పట్టా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారి నుంచి న్యాయం చేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన దళిత ఆశీర్వాదం, నాగన్న శుక్రవారం కలెక్టర్ సంతోష్‌ను వేడుకున్నారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 202లో 17 ఎకరాల భూమి ఉందని పక్క పొలానికి చెందిన వ్యక్తి తమ పట్టా భూమిని కబ్జా చేసినట్లు తెలిపాడు. కబ్జాకు గురైన పొలం నుంచి మట్టి తీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎస్పీ



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని గాంధీనగర్‌లో వెలసిన ఎలుకలమ్మ తల్లి గ్రామదేవత గుడి పునర్నిర్మాణ కార్యక్రమంలో ఎస్పీ టి.శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీఐ టాటాబాబు, ఎస్‌ఐ గోకారి, లక్ష్మీనారాయణ, త్రినాథ్, సుమన్, లక్ష్మణరావు, రంగారావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



కేటీదొడ్డి: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి రోడ్డు భద్రతా, సైబర్ మోసాలపై ప్రజలకు కళాజాత బృందం అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కళాజాతా బృందం పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



గట్టులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గట్టు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నానికి సంబంధించి శుక్రవారం గట్టు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎస్‌ఎస్‌ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసన్న మాదిగ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన న్యాయవాదిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు న్యాయ వ్యవస్థలో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండారి డేవిడ్, మాజీ సర్పంచులు సామేలు, అశోక్, ముక్కెరయ్య, రాజు, తిమ్మప్ప, డానియల్, భూషయ్య, రాజప్ప, గోకారి పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అనాగరికం

శాంతినగర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నం అనాగరికమని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొంకల భీమన్న అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దాడి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఏసేపు మాదిగ, రాజశేఖర్ మాదిగ, శేఖర్ మాదిగ, గోపి మాదిగ పాల్గొన్నారు.



శాంతినగర్‌లో వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

డిజిటల్ విద్యకు శిక్షణ అవసరం



మాట్లాడుతున్న ఎంఈఓ రాములు

అయిజ: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ అవసరమని ఎంఈఓ రాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డిజిటల్ లెర్నింగ్‌పై (ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కోడింగ్, డీ కోడింగ్, ఏఐ టూల్స్ ఉపయోగించి విధిగా ఉపాధ్యాయులు బోధించాలని ఆదేశించారు. డిజిటల్ వినియోగంపై ప్రతి ఉపాధ్యాయుడు సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ విజయభాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, సుమలత, రాజేష్‌కుమార్, రాజేశ్వర్‌రెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలపై దృష్టి పెట్టాలి

గట్టు: చదువు మధ్యలో ఆపేసిన పిల్లలను బడికి రప్పించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని గట్టు కాంప్లెక్స్ హెచ్‌ఎం నల్లారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం గంగిమాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలను నల్లారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంట ఏజెన్సీకి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేష్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎం నల్లారెడ్డి

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

గట్టు: బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, ముఖ్యంగా బాలికలు చదువును మధ్యలో ఆపేయ వద్దని జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్, శ్రీనివాసులు కోరారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాలను వారు సందర్శించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలకార్మికులు, బాల్య వివాహా చట్టాల, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనపుడు న్యాయాధికార సంస్థ 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రవి, సరాగిణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న లీగల్ ఎయిడ్ బృందం

రాష్ట్ర బంద్‌కు మద్దతునిద్దాం

అయిజ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రైవేట్ అసోసియేషన్ కళాశాలల అధ్యక్షుడు శుక్రవారం శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వెంకటేష్, జిలాని, విజయ్, శాలి, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



అయిజలో వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రిజర్వేషన్లు భిక్ష కాదు.. మన హక్కు

ఇటిక్యాల: రిజర్వేషన్లు ఎవరిచ్చే భిక్ష కాదని ఇది మన హక్కు అని మునగాల జ్యోతిరావు పూలే అధ్యక్షుడు రాముడు అన్నారు. రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించడమే ధ్యేయంగా బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌కు శుక్రవారం పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతూ ప్రకటిస్తూ అక్టోబర్ 18న వివిధ బీసీ సంఘాలు పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేద్దామన్నారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధనకై పోరాడుదమని పేర్కొన్నారు.

గద్వాల: బీసీల 42శాతం రిజర్వేషన్‌ను అమలు కోరుతూ బీసీ సంఘాలు ఈ నెల 18వ తేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన సంపూర్ణ మద్దతు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. జనాభా దామాష విధానంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అదే విధంగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత సంపూర్ణ మద్దతును తెలియజేశారు.

భీంఆర్మీ మద్దతు

ధరూరు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోరుతూ శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు భీంఆర్మీ సంపూర్ణ మద్దతు ఉంటుందని భీంఆర్మీ మండల అధ్యక్షులు ఈదన్న అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా అణగారిన వర్గాల వారందరూ ఏక తాటిపైకి వచ్చి క్రియాశీలకంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భీంఆర్మీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్‌కు శుక్రవారం ఏబీవీపీ విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. వర్షం కురిసినప్పుడల్లా మైదానం మొత్తం నీళ్లు చేరుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కళాశాల మైదానానికి ప్రహరీ లేకపోవడం వలన పశువులు సంచరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల చదువు, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు జిల్లా కన్వీనర్ రఘువంశీ ,రాష్ట్ర ఎస్‌ఎఫ్‌డీ కో-కన్వీనర్ వెంకటేష్, ఐజ నగర సంయుక్త కార్యదర్శి నరేష్, అలంపూర్ నగర ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, నగర సంయుక్త కార్యదర్శి జస్వంత్ తదితరులు పేర్కొన్నారు.